సాక్షి
సిద్దిపేట
గురువారం ı 18 ı జనవరి ı 2024

న్యూస్‌రీల్

మల్లన్న బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత
సీపీ అనురాధ



మల్లన్న చిత్ర పటాన్ని సీపీకి అందిస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు కొనసాగనున్న జాతర నేపథ్యంలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఈఓ బాలాజీ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ అనురాధను కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలపై చర్చించారు. సీపీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. తానే స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్ర పటాన్ని కమిషనర్‌కు ఆలయ చైర్మన్, ఈవో అందించారు.

ఎంపీ బండి సంజయ్‌పై పీఎస్‌లో ఫిర్యాదు



ఎస్‌ఐ మహేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, దానికి సంబంధించిన సమాచారం తెలిసి మాట్లాడుతున్నానని వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కుట్రలు చేస్తున్నవారు ఎవరో తెలిసినా వారిని బహిర్గతం చేయకుండా దాచిపెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి
ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకరూరల్: మండలంలోని శిలాజీనగర్, వెంకటగిరితండా, అచ్చుమాయిపల్లి, చౌదర్‌పల్లి గ్రామ పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న కాలువలను పూర్తి చేసి యాసంగికి నీళ్లు అందిస్తామన్నారు. అలాగే బొప్పాపూర్‌లో గౌడ సంఘం, చిన్న నిజాంపేటలో కుమ్మరి, ముదిరాజ్ సంఘాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ చైర్మన్ వెంకటయ్య, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, సర్పంచ్‌లు, ఎంపిటీసిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభ

గజ్వేల్: పట్టణంలోని శోభా గార్డెన్స్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు సకాలంలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేపు జిల్లా స్థాయి రగ్బీ పోటీలు

చేగుంట(తూప్రాన్): ఈనెల 19న మండలకేంద్రంలో మెదక్ జిల్లా స్థాయి రగ్బి పోటీలు నిర్వహించనున్నట్లు కోచ్ కర్ణం గణేశ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మోడల్ పాఠశాల ఆవరణలో అండర్ -14 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఆరోజు ఉదయం 9 గంటల లోపు చేరుకోవాలని తెలిపారు. వివరాలకు 95732 96678 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాములోరి తెప్పోత్సవం



మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని సీతా రామాంజనేయ దేవాలయంలో బుధవారం రాములోరి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. గోదా కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను భక్తులు ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ శివారులోని పెద్ద చెరువులో స్వామి వారి తెప్పోత్సవం కనులవిందుగా సాగింది.



ప్రయాణికులతో కిక్కిరిసిన హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్

బాప్‌రే.. ఇదేం రద్దీ

హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ బుధవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి పండుగకు గ్రామాలకు వచ్చిన జనం తిరిగి పట్టణాలకు పయనమవడంతో ఈ రద్దీ నెలకొంది. పండుగ సెలవులు ముగియడంతో గ్రామీణులు పట్టణ బాట పట్టారు. చాలా మంది బస్సుల్లో నిలబడే ప్రయాణం సాగించారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో నిత్యం బస్టాండ్‌ల్లో ప్రయాణికుల రద్దీ రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

– హుస్నాబాద్



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

ముక్క పక్కా

- పండుగైనా పబ్బమైనా తప్పనిసరి
- జిల్లాలో పెరుగుతున్న మాంసం అమ్మకాలు
- ఏటా రూ.150 కోట్లు ..
- ధరలు పెరుగుతున్నా తగ్గని డిమాండ్
- సంక్రాంతి పండుగరోజే రూ.కోటిన్నర మేర విక్రయాలు

పండుగైనా పబ్బమైనా ముక్క ఉండాల్సిందే.. ముక్క లేనిదే గొంతు దిగడంలేదు. జిల్లాలో పెరుగుతున్న మాంసం విక్రయాలను చూస్తే ముక్కున వేలు వేసుకోవాల్సిందే. ప్రతి ఏటా సుమారు రూ.150కోట్ల మేర మాంసం విక్రయాలు జరుగుతుండటం విశేషం. ఆదివారం వచ్చిందంటే ఇక షరా మామూలే.. సంక్రాంతి పండుగ రోజునే దాదాపు రూ.కోటిన్నర విలువైన మాంసం అమ్ముడుపోయినట్లు అనధికార లెక్కలు చెబుతున్నాయి. ఓవైపు ఏటేటా ధరలు పెరుగుతున్నా డిమాండ్ తగ్గకపోవడం గమనార్హం.



జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మాంసం అమ్మకాలు

సిద్దిపేటజోన్: జిల్లాలో మాంసం ప్రియులు ఎక్కువగా ఉండటంతో సగటున ప్రతి నెలా రూ.13 కోట్ల మేర మాంసం కొనుగోళ్లు జరుగుతున్నాయి. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పర్వ దినాలు వరుసగా వచ్చిన ఈ మధ్య కాలంలో అనధికార లెక్కల ప్రకారం సుమారు రూ.20 కోట్ల విలువైన మాంసం అమ్ముడు పోయిందనే చెప్పాలి. జిల్లాలోని దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాల్లో అనధికార లెక్కల ప్రకారం 250 చికెన్, 370 మాంసం విక్రయ దుకాణాలు, సుమారు 100 వరకు చేపల విక్రయ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. వీటికి తోడు గ్రామపంచాయతీల్లోనూ మాంసాన్ని విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్క రోజే సుమారు రూ.80 లక్షల విలువైన మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. పండుగలు వస్తే మాంసం విక్రయ వ్యాపారులకు కాసుల వర్షం కురిసినట్లే. ముక్కతో ముడిపడి ఉండే సంక్రాంతి, బక్రీద్, క్రిస్మస్, దసరా, రంజాన్, న్యూ ఇయర్ వేడుకల్లో మాంసానికి భలే గిరాకీ ఉంటుంది. ఒక్క సిద్దిపేట జిల్లా కేంద్రంలోనే ప్రతి ఆదివారం 500 పైగా మేకలు, 15 టన్నుల లైవ్ బర్డ్ చికెన్ అమ్ముడవుతోంది.

ధరలు పెరుగుతున్నా..

మార్కెట్‌లో ఏటా ధరలు పెరుగుతున్నా కొనుగోళ్లపై ఏమాత్రం ప్రభావం చూపడం లేదనే చెప్పాలి. జిల్లా కేంద్రంలో మాంసం కిలో ధర రూ.800, చికెన్ రూ.160 నుంచి 190 వరకు ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మార్కెట్‌లో నాటు కోడి ధర రూ.వెయ్యి నుంచి 1600 వరకు పలికింది. అంటే ఏ మేరకు డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మాంసం విక్రయ దుకాణాల ముందు ప్రతి సండే సందడిగా ఉంటోంది. జిల్లాలో మాంసం ప్రియులు అధికంగా ఉండడంతో ఏటా కోట్లాది విలువైన మాంసం విక్రయాలు జరుగుతున్నాయనే చెప్పాలి.

రంగనాయక సాగర్‌లోకి నీరు విడుదల

- మూడు రోజుల పాటు పంపింగ్
- ప్రభుత్వం ఆదేశాలు జారీ
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వెల్లడి



సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 18 నుంచి 20 వరకు అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి టీఎంసీ నీటిని పంపింగ్ చేయనున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగి పంట కాలానికి రైతులు పంటలు నష్టపోకుండా ఉండేందుకు రంగనాయకసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయనున్నట్లు తెలిపారు. రంగనాయక సాగర్‌నుంచి కాలువల ద్వారా గ్రామాలకు, పంట పొలాలకు సాగు నీటిని అందిస్తామన్నారు.

కొమురవెల్లి.. హాల్టింగ్ స్టేషన్



సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు రాకపోకలు సాగిస్తున్న రైలు

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే బోర్డు
- భక్తులకు, స్థానికులకు తీరనున్న కష్టాలు
- హాల్టింగ్ స్టేషన్ నిర్మాణానికి త్వరలో టెండర్లు

సాక్షి, సిద్దిపేట: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం సమీపంలో రైల్వే హాల్టింగ్ స్టేషన్ మంజూరు చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి రైల్వే లైన్ నిర్మాణం సమయంలో ప్రకటించిన రైల్వే స్టేషన్‌లలో కొమురవెల్లికి చోటు దక్కలేదు. దీంతో స్థానికులు, భక్తులు, దేవాలయ కమిటీ వారు పలు మార్లు కేంద్ర మంత్రులకు, గవర్నర్, ఎంపీలకు వినతులను అందజేశారు. స్పందించిన రైల్వే శాఖ రీ సర్వేను చేయించింది. భక్తుల సౌకర్యార్థం రైల్వే హాల్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది.

కష్టం ఫలించింది

కొమురవెల్లిలో రైలు హాల్టింగ్ స్టేషన్ మంజూరు కోసం ఢిల్లీలో స్థానికులు, భక్తులు మకాం వేశారు. కేంద్ర మంత్రులు, రైల్వే బోర్డు ప్రతినిధులు, ఎంపీలను పలువురి సాయంతో కలిసి సమస్య వివరించి ఎట్టకేలకు హాల్టింగ్ స్టేషన్‌ను సాధించారు. దీంతో భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న రైలు రాకపోకలు

మనోహరాబాద్ నుంచి కొత్తపల్లికి 151కిలో మీటర్ల రైల్వే పనులు కొనసాగుతున్నాయి. సిద్దిపేట వరకు రైల్వే పనులు పూర్తి కావడంతో అక్టోబర్ 3వ తేదీ నుంచి సికింద్రాబాద్ -సిద్దిపేటకు ప్యాసింజర్ రైలు నడుస్తోంది. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో రైలు రాకపోకలు సాగుతున్నాయి. ఇక కొమురవెల్లిలో రైల్వే హాల్టింగ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే రైలు ఆగనుంది. ప్రతీ యేడాది సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు జాతర జరగుతుంది.ఈ రోజుల్లో రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. దీంతో దేశంలోని నలుమూల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

త్వరలో టెండర్లు పిలుస్తాం

కొమురవెల్లిలో హాల్టింగ్ స్టేషన్ నిర్మాణం కోసం టెండర్లు పిలుస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం. హైలేవల్ ప్లాట్‌ఫాం, టికెట్‌కౌంటర్, హాలును నిర్మించనున్నారు.

–జనార్దన్, డీఈ, రైల్వే టెక్నికల్

వేచరేణి వాగుపై బ్రిడ్జి నిర్మించండి



వేచరేణి వాగు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

- వాగు వద్ద గ్రామస్తుల దీక్ష
- పనులు చేపట్టేవరకు నిరసన కొనసాగిస్తాం
- స్థానికుల స్పష్టీకరణ

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వేచరేణి నుంచి చేర్యాల వెళ్లే దారిలోని వాగుపై వంతెన నిర్మించాలని వేచరేణి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వాగులో దీక్ష శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈవిషయమై పలువురు మాట్లాడుతూ వాగు అవతలి ఒడ్డున వ్యవసాయ భూములు ఉండడతంతో నిత్యం రైతులకు తిప్పలు తప్పడంలేదన్నారు. మరోవైపు వైకుంఠధామం కూడా అటువైపే ఉందన్నారు. వానాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా అటువైపు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటున్నామన్నారు. అలాగే చేర్యాల- కొమురవెల్లి మండలాలకు వేచరేణి గ్రామం మీదుగా వెళ్తే తక్కువ దూరం అవుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు గెలిచిన వెంటనే పనులు ప్రారంభిస్తానని చెప్పిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇప్పుడు మౌనంగా ఉంటున్నారన్నారు. బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యేవరకు నిరసన కొనసాగిస్తామని అన్నారు.

అయోధ్య ఉత్సవాలకు డాక్టర్ అరవింద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అయోధ్యలో జరిగే రామాలయ ఉత్సవాలకు సిద్దిపేట వాసి, ప్రముఖ వైద్యుడు ఈట అరవింద్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో బుధవారం అరవింద్‌ను వివిధ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు, అమర్నాథ్ సేవా సమితి సభ్యుడు గ్యాదరి పరమేశ్వర్ మాట్లాడుతూ అరవింద్‌కు ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ యోగశిక్షకులు తోట సతీష్ , తోట సంధ్య, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనాకర్ రెడ్డి, లక్కిరెడ్డి విజయ, శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది శివాజీ, యోగా అసోసియేషన్ సభ్యులు చిప్ప ప్రభాకర్ పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 5వతరగతి, 7 నుంచి 10 వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 22 వరకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందించాలన్నారు. పూర్తి వివరాలకు దగ్గరలోని ఆదర్శ పాఠశాలల్లో సంప్రదించాలన్నారు.

మైనారిటీ పాఠశాలల్లో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల కోసం దరఖాస్తులను అహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కల్గిన విద్యార్థులు ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మార్చిలోగా పనులు పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- హుస్నాబాద్‌లో గ్రంథాలయ భవన నిర్మాణం పరిశీలన

హుస్నాబాద్: పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణాన్ని మార్చిలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం గరిమా అగర్వాల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలకు చేరడంతో తాత్కాలికంగా ఉద్యోగుల విశ్రాంతి భవనంలో కొనసాగిస్తున్నారు. ఇటీవల గ్రంథాలయాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి తేవడంతో నిరుద్యోగులు నిరసన చేపట్టారు. ఇందుకు స్పందించిన గరిమా అగర్వాల్ రూ.50లక్షల వ్యయంతో గ్రంథాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేయబోమని వెనువెంటనే చెల్లిస్తామని. పనులు వేగవంతం చేసి మార్చిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

సమయానికి పోషకాహారం అందించండి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గుండారెడ్డిపల్లి అంగన్‌వాడి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ బరువు ఉన్న పిల్లల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే సమయానికి పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడి కేంద్రంలో సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీటీసీ కల్యాణి, మండల వైద్యాధికారి నిమ్రా, సీడీపీఓ జయ పాల్గొన్నారు.

మల్లన్న సాగర్‌తో ప్రజలకు నష్టమే

- కొత్త ప్రభుత్వం ప్రాజెక్టుపై అధ్యయనం చేయాలి
- టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



కోదండరాంకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్ల సాధన సమితి నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గత ప్రభుత్వం నిర్మించిన మల్లన్న సాగర్‌తో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని టీజేఎస్ (తెలంగాణ జన సమితి) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వేములవాడకు వెళ్తూ కొద్దిసేపు సిద్దిపేటలో ఆగారు. ఈ సందర్భంగా కోదండరాంకు టీజేఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కోదండరాం మాట్లాడుతూ నీరు అందుబాటు లేని చోట మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మించారన్నారు. ఈ విషయాన్ని గతంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అనేక సార్లు తెలియజేశానన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణం 50టీఎంసీల సామర్థ్యంతో నిర్మించడం సరికాదన్నారు. మల్లన్నసాగర్ ప్రాంతం భూకంప ప్రభావిత జోన్‌లో ఉందన్నారు. ఎన్జీఆర్ఐ సైతం ఈ విషయం అంగీకరించిందన్నారు. ప్రతి సంవత్సరం రెండు నుంచి మూడు పంటలు పండే భూములను సేకరించి, అక్కడి రైతులను నిర్వాసితులను చేసి ఈ ప్రాజెక్టు నిర్మించారన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతంలో మంచి అటవీ ఉండేదని, ఈ నిర్మాణంతో పర్యావరణాన్ని ధ్వంసం చేసినట్లేనని అన్నారు. ఈ రిజర్వాయర్‌లో 10టీఎంసీల కంటె అధికంగా నీటిని నిల్వ చేస్తే, రిజర్వాయర్ దెబ్బతినడమేకాకుండా దిగువ ప్రాంతాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్ల సాధన సమితి సిద్దిపేట జిల్లా నాయకులు తమకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇప్పించే విధంగా చొరవ చూపాలని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలపాలంటూ వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్, కాంగ్రెస్ నాయకులు అడ్వకేట్ బాబు రావు, బొమ్మల యాదగిరి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన వంశీ అతడి స్నేహితుడు నందుతో కలిసి ఈనెల 15వ తేదీన రాత్రి బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు 16వ తేదీన వంశీకి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద వెతుకుతున్న క్రమంలో అదే రోజు మధ్యాహ్నం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి నుంచి ఫోన్ వచ్చింది. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో వంశీకి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వంశీని మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


సాయిప్రసాద్ (ఫైల్)

నారాయణఖేడ్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై యువకుడు మృతి చెందాడు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ మండలం లింగాపూర్‌కు చెందిన జెట్ల సాయిప్రసాద్ (32) మంగళవారం రాత్రి నారాయణఖేడ్ నుంచి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. లింగాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో సాయిప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉండగా మృతుడి పినతండ్రి జెట్ల విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎడ్ల బండ్ల ఊరేగింపులో అపశృతి

- బండి చక్రాల కిందపడ్డ యువకుడు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాయపోలు(దుబ్బాక): సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండ్ల ఊరేగింపులో అపశృతి చోటు చేసుకుంది. ఊరేగింపులో భాగంగా కిందపడిన యువకుడిపై బండి చక్రాలు పోవడంతో తీవ్ర గాయాలు మృతిచెందాడు. రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనాజీపూర్‌లో ప్రతీయేడు మాదిరి బయ్యన్నగుండ్ల జాతర నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఎద్దుల బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. బండ్ల ఊరేగింపులో గ్రామానికి చెందిన దాసరి మధు బండి చక్రాల కింద పడిపోయాడు. గాయపడిన యువకుడిని వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్చింగ్‌తో మస్తు దిగుబడి

- ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్న రైతులు
- సమయం, నీరు ఆదా
- కలుపు నివారణ, మొక్కల పెరుగుదలకు దోహదం
- మెలకువలు పాటిస్తూ అధిక లాభాలు



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కాలానికి అణుగుణంగా సాగు చేయడంలో రైతులు ఆధునిక పద్ధతులపై ఆసక్తి చూపిస్తున్నారు. నీటిని ఆదా చేస్తూ, సమయాన్ని, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తున్నారు. సాగులో మెలకువలు పాటిస్తూ అధిక దిగుబడులను సాధించడానికి మొగ్గు చూపిస్తున్నారు. సాగు పెట్టుబడులను, సమయాన్ని ఆదా చేయడానికి రైతాంగం మల్చింగ్ సాగు పద్ధతులను అవలంబిస్తున్నారు. ఆధునిక మల్చింగ్ పద్ధతి ద్వారా పంటలలో కలుపు, సాగునీటి సమస్యలను అధిగమించి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. మల్చింగ్ సాగు పద్ధతులపై రైతులకు మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచనలు, సలహాలు..

– మిరుదొడ్డి

మొక్కల చుట్టూ నేలను ఏదైనా పొరతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. ఈ పద్ధతిని రెండు రకాలుగా వినియోగంలో ఉంది. మొదటి పద్ధతిలో ఎండు గడ్డి, రంపపు పొట్టు, ఎండిన ఆకులు, వరి పొట్టును మొక్కల చుట్టూ రెండు నుంచి ఐదు అంగుళాల మందంతో నేలను కప్పి ఉంచాలి. ఇది పంట కాలంలో మల్చింగ్‌గా తర్వాత ఎరువుగా ఉపయోగపడుతుంది. రెండోది ప్లాస్టిక్ షీట్లను ఉపయోగించి మొక్క చుట్టూ నేలను కప్పి ఉంచుతారు. ఎండ వేడికి నీరు ఆవిరి కాకుండా తేమ నిలుపుకోవడం కోసం కలుపు మొక్కలను నివారించి పంట ఏపుగా పెరిగేందుకు దోహదం చేస్తుంది.


మిరుదొడ్డిలో మల్చింగ్ సాగు

షీట్లను అమర్చుకునే విధానం

- పండ్ల తోటలకు గానీ, కూరగాయల సాగు కోసం కాస్త ఎత్తుగా ఉన్న పాదులకు సరిపడా ప్లాస్టిక్ షీట్లను అమర్చుకోవాలి. పాదుల మధ్యలో మొక్కల వరుసల దూరాన్ని బట్టి షీట్లకు రంధ్రాలు చేయాలి.
- రంధ్రాల్లో రెండు నుంచి మూడు విత్తనాలు వేసి, మట్టిని కప్పాలి. ఈ విధంగా చేస్తే 20 నుంచి 25 శాతం వరకు విత్తనాలు ఆదా అవుతాయి.
- మొలకెత్తిన మొక్కల మీద షీట్లను పరుచుకోవాలంటే మొక్క చుట్టూ షీట్‌ను తగిన సైజ్‌లో గుండ్రంగా కత్తిరించి ప్రతీ మొక్క మొదట్లో వచ్చేలా తొడగాలి.
- మల్చింగ్ షీట్లు చాలా రకాల రంగుల్లో వివిధ రకాల మందంతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సీజన్ పంటలను బట్టి షీట్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.
- ఎంత విస్తీర్ణంలో మల్చింగ్ వేసుకోవాలో అంతే తగ్గట్టుగా సాలు పొడవులను అంచనా వేసుకోవాలి.

ఉపయోగాలు

- మల్చింగ్ విధానంలో ఒక్కసారి నీరు పెడితే 20 నుంచి 30 రోజుల వరకు తేమ ఆరిపోకుండా ఉంటుంది.
- మొక్కల వేళ్లకు అవసరమైన తడి ఉంటే ఆరోగ్యంగా పెరుగుతాయి. షీట్ల వల్ల కలుపును పూర్తిగా నిరోధిస్తుండడంతో మొక్కల ఎదుగుదలకు దోహదం చేస్తుంది. దీంతో కూలీల ఖర్చు, శ్రమ తగ్గుతుంది.
- మల్చింగ్ పద్ధతిలో డ్రిప్ ద్వారా నీరు అందిస్తే నీటిని ఆదా చేసుకోవచ్చు. కూలీల అవసరం ఉండదు. తెగుళ్లు, పురుగులు ఆశించే అవకాశం తక్కువ.
- భూమిలో తేమ ఎప్పుడూ ఉండడం వల్ల నేలలో గుల్లబారి మొక్కల వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. మొక్క చుట్టూ సూక్ష్మ వాతావరణ పరిస్థితుల వల్ల నేల అధిక ఉష్ణోగ్రతను తట్టుకుంటుంది.
- చీడ పీడల నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపడుతూ వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటిస్తే మల్చింగ్ సాగుతో మంచి దిగుబడులతోపాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మిర్చి సాగు చేస్తున్నా..



మూస పంటల సాగుకు స్వస్తి పలికి ఆధునిక పంటల సాగు చేయాలనుకున్నాను. ఎకరం వ్యవసాయ భూమిలో మల్చింగ్ సాగు పద్ధతులను అవలంభించి మిర్చి సాగు చేస్తున్న. సాగు నీటిని ఆదా చేయడానికి డ్రిప్పును వినియోగిస్తున్నా. డ్రిప్పు పద్ధతితో నేల నిరంతరం తడిగా ఉండటంతో మొక్కలు అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే అవకాశాలు ఉన్నాయి. పాదులను మల్చింగ్ కప్పి ఉంచడం వల్ల కలుపు పూర్తిగా నివారించబడుతోంది. దీంతో కూలీల ఖర్చు తప్పింది. గతేడాది సాగు పద్ధతులను అవలంబిస్తే పెట్టుబడులు సుమారు రూ.70 వేలు పోగా రూ.లక్ష ఆదాయం సమకూరింది.

– గుండెల్లి శ్రీనివాస్, యువ రైతు, మిరుదొడ్డి

హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ రాజు

జహీరాబాద్ టౌన్: హత్యాయత్నం కేసులో ఒకరిని అరెస్టు చేసి బుధవారం కోర్టులో రిమాండ్ చేసినట్లు జహీరాబాద్ టౌన్ సీఐ రాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన సిరిగిరి మహేశ్ కూతురు ఇంటర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ కూతురితో ప్రేమలో ఉన్నట్లు మహేశ్‌కు తెలియడంతో చదువు మాన్పించాడు. ఈ నెల 12వ తేదీ నుంచి ఇద్దరూ కనిపించకుండా పోయారు. మహేశ్ జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కూతురు కనిపించకుండా పోయిందని మిస్సింగ్ కేసు పెట్టాడు. ఇలా ఉండగా తన అన్నకూతుర్ని శ్రీకాంత్ ఎత్తుకెళ్లాడానికి మహేశ్ తమ్ముడు సిరిగిరి కృష్ణ అతడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 13 తేదీన కృష్ణ, శ్రీకాంత్ ఇంటికి వెళ్లి తన అన్నకూతురు ఎక్కడుందో చెప్పాలని తల్లి పార్వతిని ప్రశ్నించాడు. ఆమెతో గొడవకు దిగాడు. విషయం తెలుసుకున్న పార్వతి కూతురు అనురాధ, ఆమె భర్త వెంకట్ ఇంటికొచ్చి కృష్ణతో మాట్లాడుతున్నారు. ఎలాగైనా వారిని చంపుదామని వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను భార్యాభర్తలపై పోశాడు. వారు కేకలు పెట్టడంతో చుట్టూ పక్కల ఉన్న వారు వచ్చేసరికి కృష్ణ పరారయ్యాడు. అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు సీఐ వివరించారు.

బాలుడి కిడ్నాప్‌కు యత్నం


కిడ్నాప్‌కు గురైన బాలుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): బాలుడిని కిడ్నాప్‌కు యత్నించిన ఘటన మండల పరిధిలోని రాజోలలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... రాజోల గ్రామానికి చెందిన సునీత, రాజుకు ఇద్దరు కుమారులు. ఇద్దరూ హుస్సెల్లి గ్రామ శివారులోని శ్రీస్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. తండ్రి అదే పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండో కుమారుడు గణేశ్ (9) ప్రతిరోజూ తెల్లవారుజామున 5.30 గంటలకు తల్లి ఫోన్ తీసుకొని వాకింగ్ వెళ్లేవాడు. బుధవారం ఉదయం సైతం వాకింగ్‌కు వెళ్లాడు. ఎంతసేపు అయినా గణేశ్ ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫోన్ చేశాడు. తనను ఎవరో తీసుకెళ్లారని, ఓ ఇంటి వద్ద ఉన్నానని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల వెతుకుతుండగా మామిడ్గి సమీపంలో కేకలు వేస్తూ గణేశ్ కనిపించాడు. తనను ఎవరో కిడ్నాప్ చేశారని, బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో తెచ్చుకోవడానికి వెళ్లిన సమయంలో తాను తప్పించుకున్నానని బాలుడు కుటుంబ సభ్యులకు వివరించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా బాలుడిని ఎవరూ కిడ్నాప్ చేయలేదని, కావాలని కిడ్నాప్ చేసినట్లు బాలుడు చెబుతున్నాడన్నారు. విచారణలో భాగంగా బాలుడితో మాట్లాడితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామానాయుడు తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో..

మహిళకు మూడేళ్ల జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్: ఆత్మహత్యకు ప్రేరేపించిన ఓ మహిళకు కోర్టు మూడేళ్ల జైలుశిక్షతోపాటు జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. క్రైమ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం వీరోజీపల్లి గ్రామానికి చెందిన మొగులమ్మ(38) భర్త చనిపోవడంతో బతుకుదెరువు కోసం పటాన్‌చెరులోని చైతన్యనగర్ కాలనీకి వచ్చి నివాసుంటూ కూలీ పని చేసుకుంటుంది. అదే జిల్లా పెద్దశంకరంపేట మండలం శివ్వాయిపల్లికి చెందిన కిషన్ తన కుటుంబంతో ఇదే కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలోనే కూలీ పని చేసుకునే కిషన్ పెద్ద కుమారుడు లింగం(20)కు మొగలమ్మకు పరిచయం ఏర్పడింది. మొగులమ్మ తనను ప్రేమించాలని లింగంపై ఒత్తిడి తీసుకొచ్చేది. అయితే, రూ.60 వేలు తీసుకురావాలని వేధించడంతో 2019 జూలై 24వ తేదీన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతికి కారణమైన మొగులమ్మపై మృతుడి తండ్రి కిషన్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ సాయిలు కేసు నమోదు చేసి ఆమెను అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా నిందితురాలికి నాలుగున్నరేళ్ల తర్వాత బుధవారం మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రాధాకృష్ణ చావాన్ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తెలిపారు. నిందితురాలికి శిక్షపడేలా చేసినందుకు సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సాయిలు, పీపీ అనంతరావు కులకర్ణిని ఎస్పీ అభినందించారు.

అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధం


పూర్తిగా కాలిపోయిన దుకాణం

రామాయంపేట(మెదక్): అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధమైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేట పట్టణానికి చెందిన శ్రీనివాస్‌చారి కార్పెంటర్ షాప్‌లో అర్ధరాత్రి ఉవ్వెత్తున మంటలు చెలరేగాయి. పక్కనే నివాసం ఉంటున్న వారు చూసి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి చెప్పారు. అప్పటికే దుకాణం పూర్తిగా దగ్ధమైంది. దాని వెనుక భాగంలోని ఇంటి తలుపులు, కిటికీలకు మంటలు వ్యాపించి కాలిపోయాయి. అదే ఇంట్లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు వెనుక డోర్ నుంచి బయపడ్డారు. ఫైర్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కలపతోపాటు మిషన్లు కాలిపోయాయి. నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంపై బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. తమ షాపు పక్కనే ఉన్న కల్లు దుకాణం నిర్వాహకులు నిర్లక్ష్యంగా చెత్తను కాల్చడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బదిలీలను వెంటనే చేపట్టాలి

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఎంఈఎఫ్ నేతల వినతి

గజ్వేల్ : రాష్ట్రంలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎంఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన్ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన ఎన్నో సమస్యలు ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని, పీఆర్‌సీ నివేదికను వేగవంతం చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు పెండింగ్ డీఎలను విడుదల చేయాలని కోరామన్నారు. అదే విధంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జీఓ నెంబర్ 317 వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు అయోధ్య, రాష్ట్ర నాయకులు పాల్వాయి వెంకన్న, సత్యనారాయణ, జానయ్య, యెర్ర శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎంఈఎఫ్ నేతలు

తగ్గుతున్న పశుపోషణ

- పెరిగిన యాంత్రీకరణ
- పశువులకు మేత దొరకని పరిస్థితి


పశువులతో పొలం దున్నుతున్న రైతు

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లె అనగానే పచ్చని పంట పొలాలు.. ప్రతీ ఇల్లు పాడి పంటలతో కళకళలాడేవి. మానవ జీవితంలో పశువులతో మనిషికి ప్రత్యేక అనుబంధం ఉండేది. పశుపోషణ వ్యవసాయానికి అనుబంధంగా కొనసాగేది. కానీ వ్యవసాయం దెబ్బతినడం, యాంత్రీకరణ ప్రభావంతో పశువుల పెంపకం భారీగా తగ్గిపోయింది. రైతులు పొలం పనులకు యంత్రాలనే వాడుతున్నారు. వరి నాట్లు, పొలం దున్నడానికి, కోతలు కోయడానికి ఆధునిక యంత్రాలపై ఆధారపడుతున్నారు. దీంతో పశువులకు గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. రైతులు పశువులను కాపాడుకోవాలంటే మోయలేని భారం అవుతుంది.

మేత దొరకడం లేదు

గ్రామాల్లో ఒకప్పుడు పశువులు, కోళ్లతో ఇళ్లు కళకళలాడేవి. మారుతున్న పరిస్థితు వల్ల పశువుల, కోళ్ల పెంపకం రోజు రోజుకూ తగ్గుతుంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పనిముట్లు రావడం. యంత్రాలతో పంటలు కోయడంతో పశువులకు మేత దొరకడం లేదు. పట్టణ ప్రభావం గ్రామాలపై పడుతుండటంతో గ్రామీణ వ్యవస్థ మారిపోతుంది.

– యాట రాజు, రైతు మాచాపూర్

చిరు ధాన్యాల ఉత్పత్తులకు ఆదరణ


ఉచితంగా పంపిణీ చేసిన యంత్రాలతో కృష్ణ తేజ, మహిళలు

జహీరాబాద్: మార్కెట్‌లో చిరు ధాన్యాల ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని నాబార్డు డీడీఎం కృష్ణ తేజ అన్నారు. డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో చిరుధాన్యాల సాగు, వాటి విలువల జోడింపు పదార్థాల తయారీలో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లను అందజేశారు. ముగింపు కార్యక్రమంలో కృష్ణ తేజ మాట్లాడుతూ.. రైతులు తమ ఆదాయాన్ని విలువల జోడింపుతో అధికం చేసుకోవచ్చన్నారు. ఇంతకు ముందే శిక్షణ పొందిన అల్గోల్ గ్రామం వారికి పిండిగిర్ని, చిరుధాన్యాల పొట్టు తీసే మంత్రం, ఓవెన్‌లను పంపిణీ చేశారు. అనంతరం చిరు ధాన్యాల దుకాణాన్ని ప్రారంభించారు. శిక్షణలో చిరు ధాన్యాల సాగుకు అనువైన నేలలు, మట్టి పరీక్ష, ఎరువుల తయారీ సాగులో మెలకువలు, కషాయాల తయారీ, వివిధ చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ, ప్యాకింగ్ వంటి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్నేహలత, హేమలత, సూపర్‌వైజర్ నర్సమ్మ, ఫార్మ్‌మేనేజర్ శ్రీకాంత్‌తోపాటు జగన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన అదనపు కలెక్టర్


సీపీ అనురాధకు మొక్క అందజేస్తున్న గరిమా అగర్వాల్

సిద్దిపేట కమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను సీపీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ బుధవారం మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధి, తదితర అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.

రాజన్నా.. నీకు దిక్కేది!

- అటకెక్కిన పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి
- ప్రతీయేటా రూ.అరకోటి ఆదాయం
- దేవాదాయశాఖ ఆధీనంలో చేరి నాలుగేళ్లు
- నగంలోనే రాజన్న రాజగోపురం పనులు
- ఊసేలేని కోనేరు, కోడెల మండపం


అసంపూర్తిగా రాజగోపురం పనులు

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి అటకెక్కింది. భక్తుల మొరను దేవుడు కరుణించి కోర్కెలు తీర్చుతున్నా.. దేవాలయ అభివృద్ధిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. సంక్రాంతికి ప్రారంభమయ్యే పొట్లపల్లి జాతర నుంచి మహాశివరాత్రి వరకు వివిధ జిల్లాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని కానుకలు సమర్పిస్తుంటారు. భారీ ఎత్తున ఆదాయం వస్తున్నప్పటికీ ఆలయం అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొగ్గలి అక్కడే అన్నట్లుగా ఉంది. అలాగే భక్తులకు మెరుగైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

- జాతర ఉత్సవాలకు రూ.35 లక్షల వరకు ఆదాయం రాగా, మరో రూ.15 లక్షలు వివిధ దుకాణాల సముదాయం నుంచి వస్తోంది.
- ఏడేళ్ల కిందట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ నిధులతో రూ.1.10 కోట్లతో రాజగోపుర పనులు ప్రారంభించారు.
- 70 శాతం పనులు పూర్తి కావడంతో రూ.75 లక్షల వరకు బిల్లులు చెల్లించారు. మరో రూ.30 లక్షలు ఖర్చు చేస్తే రాజగోపురం పనులు పూర్తి అవుతాయి. కానీ మధ్యలో ఆపేసిన అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.
- గ్రామ పాలకుల మధ్య ఏర్పడిన విభేదాలతో ఆలయాన్ని 2019 డిసెంబర్‌లో దేవాదాయ ధర్మదాయశాఖకు అప్పగించారు.
- అప్పటి నుంచి వచ్చిన ఆదాయాన్ని బ్యాంక్‌లో జమ చేస్తున్నారు. వీటితో సిబ్బంది వేతనాలు చెల్లిస్తున్నారు తప్ప మరే పనులు చేయడం లేదు.
- మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రతీసారి లక్షకు పైగా భక్తులు వస్తుండడంతో ఉత్సవాలను ఘనంగా జరిపిస్తారు.
- కానీ ఇక్కడికి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు కోనేరు లేదు. ఎప్పటి నుంచే నిర్మించాలని భక్తులు కోరుతున్నా ఆలయ కమిటీ పట్టించుకోవడం లేదు.
- సామూహిక మూత్రశాలలు నిర్మించాలని ఉపాధి హామీ పథకంలో రూ.2 లక్షల నిధులు మంజూరు చేసినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.
- దేవాలయానికి పూర్తి స్థాయి ఈఓ లేకపోవడంతోనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కోనేరు నిర్మించాలి



ప్రతీయేటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదు. వచ్చిన ఆదాయం తీసుకోవడమే తప్ప పైసా పని చేసి ఆనవాళ్లు ఒక్కటీ లేవు. ప్రభుత్వ ఆధీనంలో ఉంటే అభివృద్ధి జరుగుతుందని ఆశించిన భక్తులకు నిరాశే మిగులుతోంది. రూ.కోటి నిధులు ఉన్నా రాజగోపురం పూర్తి చేయడం లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి కోనేరు నిర్మాణం చేయించాలని కోరుతున్నాం.

– కర్ర రవీందర్‌రెడ్డి, పొట్లపల్లి

మాస్టర్ ప్లాన్‌కు మంత్రి ఆదేశం



పొట్లపల్లి స్వయం భూ రాజేశ్వరస్వామి ఆలయం, హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ దేవాలయం, కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భక్తులకు కావాల్సిన వసతులు ఏంటో గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. కొత్త కొండ జాతర ముగిసిన వెంటనే మాస్టర్ ప్లాన్ తయారు చేస్తాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మహాశివరాత్రి వరకు అభివృద్ధి పనులు చేపడుతాం.

– కిషన్‌రావు, ఇన్‌చార్జి ఈఓ